# దీపం

"ఓలమ్మో, కిరిసినుయిన పోత్తున్నారే!" అని అంటూ వీరమ్మ డబ్బా, డబ్బులు తీసికొని రావడానికి గుడిసెకు లగెత్తింది.

పన్జేయటానికెళ్ళుతూ షావుకారు చెంగయ్య కొట్టుదగ్గర జనం కిర్సనాయిలుకోసం క్యూలో నిలబడి వుండటం చూచేసరికి వీరమ్మకు పండుగ చేసుకున్నంత సంబరమయి పోయింది.

- వురుకులు పరుగులమీద గుడిశకెళ్ళి కిర్సనాయిలు డబ్బా తీసికొని వచ్చింది. ఇకా పూటకు పనికి ఎగనామం పెట్టి కిర్సనాయిలు కోసం క్యూలో నిలబడింది. మనిషికొక లీటరు పోస్తారంట.

అప్పటికి వారం రోజుల్నుంచి ఊళ్ళో కిర్సనాయిలు మాయమయిపోయింది.

ఈ ముదనష్టపు కిరిసనుయిన కోవడం ఏ పూట కాపూట పనిసెరుపు. నాగాలు పెట్టాల్సొస్తుంది. ఇట్టగయితే ఇంకోర్ని సూసుకుంటాం అని "అమ్మగోరులు" తెగ గుంజుకున్నారు. ఇకా శారదమ్మ గారయితే సెప్పనక్కర్లేదు. గయ్ గయ్ మని కాట్లకుక్కలాగా మీద పడింది. ఈ కిరిసినుయిన సురుసుకుసోను నా పిల్ల సన్నాసుల నోటికాడి కూడు పోతున్నాది. పన్లోకి పోతే పాచిదో, కంపుదో ఇంత ముద్దయినా దొరుకుతుంది. పనికి నాగాపెట్టితే అదీ లేదు, గంజి నీళ్ళతో కడుపు నింపుకోవాలా."

వీరమ్మ మధ్య తరగతి ఉద్యోగస్థుల యిళ్ళల్లో పాచిపని చేసుకుని పొట్టపోసుకుంటుంది. ఆ జీతపు రాళ్ళతో, "అమ్మగార్లు" దయతల్చి పెట్టే అన్నం కరుళ్ళతో ఈ కరువుకాలంలో తల్లి, ముగ్గురు పొట్టలు నిండవు. రెండు పూటలా ఇన్ని గంజినీళ్ళు త్రాగాలంటే ఇంకేదయినా పని చేయాలి. వీరమ్మ రోజా చీకటి పడిన తర్వాత సెంటర్లో కూర్చుని రిక్షా బళ్ళవాళ్ళకు కిర్సనాయిలమ్ముకుంటుంది.

రోజా సాయింత్రప్పూట యిళ్ళలో పనయిపోయిన తర్వాత గుడిశకుపోతూ లీటరూ,రెండు లీటర్లు కిర్సనాయిలు కొనుక్కొని పోతుంది. చీకటి పడుతుండగా కిర్సనాయిలు డబ్బాతోపాటు ఒక చిన్న దీపపుబుడ్డి, గరాటా, పాతగుడ్డ పీలికలూ తీసుకుని సెంటరుకి పోతుంది. సెంటర్లో "గవుసు" సైకిలు కొట్టు ప్రక్కన రోడ్డువార ఆ చిన్నిదీపం బుడ్డిని వెలిగించి తనబుల్లి దుకాణాన్ని తెరుస్తుంది. ఆ సెంటర్లో మామూలుగా వుండే రిక్షాబళ్ళవాళ్ళు, చీకటిపడిన తర్వాత ఆ సెంటరువయిపు కొచ్చేవాళ్ళు. వీరమ్మ దగ్గర దీపంబుడ్లకు కిర్సనాయిలు పోయించుకుంటారు.

"అయ్యగారు, నాకు తెలియకడుగుతాను - ఈ కిర్సినుయిన కేటి వచ్చిందంటారు?" అని అమాయకంగా ఒక ఆసామిని అడిగింది.

"నీవు అడివిలో వుంటున్నావా ఏంది? అక్కడ పాకిస్తానోడొచ్చి బాంబు మీద బాంబు ఏస్తుంటే-" అన్నాడా సామి వీరమ్మనొక వెర్రిగొడ్డుకింద జమకట్టి.

"ఈ ఇద్దెమనేది ఏడ జరుగుతుందంటారు బాబు" అని మళ్ళీ అడిగింది.

"ఏడా, పక్కగొందిలో-" అన్నాడొక కొంటెకుర్రాడు. అందరూ గొల్లున నవ్వారు. వీరమ్మ మొగం చిన్న చేసుకుని అయోమయంగా చూచింది.

ఎక్కడో జరిగే యుద్ధానికి ఇక్కడ షావుకారు కొట్లో దొరికే కిర్సనాయిలుకూ సాపత్య మేమిటో వీరమ్మ కంతుపట్టలేదు. నిన్న మొన్నటి దాకా ఎంత కావాలంటే అంత దొరికిన కిర్సనాయిలు యుద్ధమనగానే ఏమయిపోయిందో కూడ వీరమ్మ "మామూలు బుర్ర" కెక్కలేదు.

కిర్సనాయిలు పొయ్యటం మొదలు పెట్టారు, క్యూలో తొక్కిడి, అలజడీ ఎక్కువయింది. క్యూలో వున్నవాళ్ళకొక వయిపు పోస్తుంటే, మరొక వయిపున మొగమాటస్తులకు, ఎక్కువ ధర యిచ్చేవాళ్ళకూ దొడ్డిదారిన చాటు అమ్మకం సాగుతుంది.

మధ్యలో చెంగయ్య బయటికొచ్చి జనం మీద కేకలేస్తున్నాడు. "ఏంటా తోపులాట! వోఁయ్, ఏందయ్యా అట్టా తోసుకొస్తావూ? అవకడ లయిను కట్టిందెందుకు? ఇట్టగయితే తల్కుండమోయ పొయ్యటం ఆపుచేత్తా! ఆఁ-"

వుండి వుండి చెంగయ్య భార్య లక్ష్మీకాంతమ్మ బయటికొచ్చి క్యూలో నిలబడ్డ జనాన్ని పురుగుల్ని చూచినట్లు చూచిపోతుంది.

ఖాతాదార్ల డబ్బులతో లాభాలుచేసి అలా వంట్లో కొవ్వు పెంచుకున్న ఆ మొగుడూ, పెళ్ళాలకు ఈ జనాన్ని చూస్తే అంత చిరాకూ, ఛీత్కారమూ ఎందుకో వీరమ్మ కర్థం కాలేదు.

క్యూలో వున్నవాళ్ళకు మొత్తానికొక పదిమందికో పోశారో లేదో కిర్సనాయి లయిపోయిందన్నారు. వీరమ్మకు నవజీవాలు క్రుంగిపోయాయి. ఇవ్వాళ్ళకూడ కిరిసినుయిన బేరంలేదు. ఆ వచ్చే అర్ధరూపాయి డబ్బులూ పోనాయి. వారం రోజుల మట్టీ కిరిసినయిన దొరికి సావకా బేరం మానేసింది. మాయదారి ఇద్దం వచ్చి పిల్లలనోటి కాడి కూట్లో దుమ్ముకొట్టింది. ఓ లమ్మో, ఇకా బూసియ్య బాకెట్టా తీర్చాలి దేవుడో..... ఏ రోజుకారోజు ఈ మయిన బేరం ఇట్టా తగలడి పోతుంటే.... ఇకా నా బతుకూ, నా పిల్లల బతుకూ కుక్కల బతుకయి పోతుందిరా. బగమంతుడా! అని అనుకుంది.

క్యూ చెదిరిపోయింది. జనమంతా నిరుత్సాహ పడిపోయారు.

"అంతా నాటకమండి, పదిమందికి పొయ్యగానే అయిపోతుందా? అడిగేవాళ్ళు లేకకాని -"

"లీటరు రూపాయి పెట్టితే కావాల్సినన్ని లీటర్లు పోస్తాడే చెంగయ్య! దొడ్డిచాటు అమ్మకం అంతా ఈ బాపతే!"

"ఈ పేటకంతకీ ఒక్క కొట్టుకే కోటా వుంది!"

"అందుకే ఆడికంత అజం!" ఒక యిల్లాలు మెటికలు విరిసింది. పాపం, ఆమె కడుపు రగిలిపోయి వుండాలి.

"అసలు, సగం నీళ్ళు పోస్తున్నారండి, స్టౌ వెలిగి చావందే!"

ఇలా తలా ఒకమాట బయటబజార్లో నిలబడి అనేవాళ్ళేకాని, అదేమాటను ఆ షావుకారుతో, "ఇదేం అన్యాయమయ్యా" అని అడిగేవాళ్ళు కాని, జరుగుతున్న మోసాన్ని ప్రతిఘటించే వాళ్ళు కాని ఒక్కళ్ళూ లేరు. ఇక వీరమ్మలాటి వెర్రిగొడ్డుల సంగతి వేఱే చెప్పాలా?

వీరమ్మ నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ గుడిశ దారి పట్టింది. ఇకా రోజుకు పనికి పొయ్యేదిలేదు. ఆ సందు మొగుదలకి వచ్చేసరికి పక్కబజార్లో పోస్తున్నారని ఎవరో అన్నారు. మళ్లీ లేని వుషారు తెచ్చుకుని ప్రక్క బజారుకు పరుగెత్తింది. తీరా అక్కడికెళ్ళే సరికి అక్కడకూడా అయిపోయింది. అక్కడకూడా ఈ చెంగయ్య లాటివాడు అయివుంటాడు. దేశంలో ఇలాటి చెంగయ్యలెందరు లేరు!

వీరమ్మ ఖాళీడబ్బా తీసికుని దిగులుగా గుడిశకు బయలుదేరింది. వీరమ్మ గుండెల్లో గుబులు బయలుదేరింది.

'ఏదో రోజుకి కిరిసినుయిన బేరంమీద ఒ అర్ధ రూపాయి డబ్బులొత్తున్నాయనుకుంటె అయీ ఇట్టగయిపోవాలా?' అని అనుకుంది.

కిర్సనాయిలు పోసి, లైటు చిమ్నీకి పట్టిన మసిని పాతగుడ్డతో తుడిచి, వత్తి వెలిగించినందులకు బుడ్డికి పదిపైసలు తీసికుంటుంది. ఇదివరకు అణా తీసికునేది. ఆ మధ్య కిర్సనాయిలు ధర పెరిగినప్పట్నించి పదిపైసలు తీసికుంటున్నది. ఒక లీటరు కిర్సనాయిలు దాదాపు పది దీపం బుడ్లకు వస్తుంది.

వీరమ్మ రోజుకు ఒక లీటరు, లీటరున్నరా కిర్సనాయిలు అమ్ముతుంది. రోజుకు అర్ధరూపాయి పదిఅణాల లాభం గడిస్తుంది. పాచిపనులు చేసి నెలవారి సంపాదించే డబ్బులకు ఈ డబ్బులు వేణ్ణీళ్ళకు చన్నీళ్లు లాగా తోడవుతాయి. తనూ, తన ఇద్దరు పిల్లలూ నెలపొడుగునా రెండు పూటలా ఇన్ని గంజినీళ్ళు త్రాగాలంటే తను రోజూ రాత్రి తొమ్మిదిగంటలవరకు రోడ్డుపక్క చలిలో కుక్కలాగా మునగదీసికుని రిక్షాబళ్ళకోసం ఎదురుచూస్తూ కూర్చోవాలి. అప్పటివరకు తన చిన్నపిల్లలిద్దరు 'గవుసు' కొట్టుపక్క ఇసుకలోదొర్లి ఆటలాడినంతసేపు ఆడి, రాజుగారి మిషనుకొట్టు అరుగుమీద మునగదీసుకుని పడుకొని నిద్రపోతారు. తొమ్మిది గంటలకు తను దీపంబుడ్డి ఆరిపేసి నిద్రపోతున్న రెండేళ్ళ కొడుకును చంకలోవేసుకుని, నిద్రమత్తులో వూగుతూ తూగుతూ నడిచే అయిదేళ్ళ కూతుర్ని చేయిపట్టుకుని గుడిసెకు పోతుంది.

"ఈ ముండకీ అర్ధరూపాయి డబ్బులెందుకు రావాలి. ఈ బతుకెందుకు బతకాలని ఆ బగమంతుడు కిర్సనాయిలు దొరకకుండా ఇట్టా చేశాడు. కానీ..... నానోట్లో, నా పిల్లలనోట్లో ఎంత దుమ్ము కొట్టాలనుకుంటున్నాడో అంతా కొట్టనియి -" తెరతెరలుగా వస్తోన్న ఏడ్పును గొంతులో అదిమిపెట్టుకుంటూ అనుకుంది.

* * *

వీరమ్మ గుడిశకు వచ్చేసరికి ఒక వయిపునుంచి సన్నసన్నగా చీకటి పడుతుంది. ఒకవయిపు

కిర్సనాయిలు పోసి తగలపెట్టుతున్నట్లుగా ఎర్రని వెలుగు దిగజారుతుంది.

వీరమ్మ గుడిసె కాలవగట్టు వయిపు వున్న గుడిశల్లో వుంది. ఆ సమయంలో వీరమ్మ గుడిశ ముందు నిలబడి భూషయ్య చిందులు త్రొక్కుతూ వూరెగిరిపోయేటట్లు కేక లేస్తున్నాడు. భూషయ్య ఆ కాలవగట్టు అంతా మున్సిపాలిటీవాళ్ళ దగ్గర్నుంచి కాంట్రాక్టు తీసికుని గుడిశ లేసుకొనటానికి లేబరు జనానికి నేల అద్దెకిచ్చాడు. గుడిసెకు నెలకయిదు రూపాయలు చొప్పున ప్రతి మూడునెలల కొకసారి ముందుగానే పదిహేను రూపాయలు వసూలు చేస్తాడు. వీరమ్మ పదిహేను రూపాయలు బాకీపడింది. అద్దెకట్టవల్సిన గడువుదాటి నెల రోజులు కావస్తున్నా డబ్బుకట్టలేకపోయింది. పాపం, ముందుగానే జాగ్రత్తపడి భూషయ్యకు కట్టటానికి కిర్సనాయిలు బేరంమీద వచ్చే డబ్బులు తిన్నా తినకపోయినా కూడబెడుతూ వచ్చింది. పది రూపాయాలు పోగయ్యాయికూడా. కాని, ఈమధ్య కొడుక్కు ప్రాణంమీదకు ముందుచుకొచ్చింది. నాల్గు రోజులు బంక విరేచనాలవుతుంటే ధర్మాసుపత్రికి వెళుతూ వచ్చింది. వాళ్ళిచ్చే ఆ "రంగునీళ్ళు" పోసింది. వాడికొక రాత్రి కాళ్ళూ చేతులూ చల్లబడ్డాయి. గుడ్లు తేలేశాడు. అప్పుడు వాడ్ని ప్రయివేటు డాక్టరు దగ్గరకు తీసికొనిపోయి "సూదిమందు" ఇప్పించి బిడ్డడ్ని దక్కించుకున్నది. ఆ పదిరూపాయలు కాస్తా ఇలా ఖర్చయిపోయాయి. భూషయ్య కెప్పటికప్పుడు వాయిదాలు పెట్టుతుంది. భూషయ్య నాల్గురోజుల కొకసారి వచ్చి ఆగం ఆగంచేసి పోతున్నాడు.

ఇప్పుడు కూడా అద్దె డబ్బులకోసమే అలా కోతిలాగా చిందులు త్రొక్కుతున్నాడు. వీరమ్మ కూతరు ఐదేళ్ళది సీత జారిపోతున్న చెడ్డీని పైకెగలాక్కుంటూ ముక్కులోంచి కారుతున్న చీమిడిని పైకెగపీలుస్తూ చంకలోని తమ్ముడ్ని ఇట్నుంచి అటుకు, అట్నుంచి ఇటుకు మార్చుకుంటూ భూషయ్య ఏమంటున్నాడోఅర్థంకాక బిక్కమొగమేసుకుని చూస్తూ నిలబడింది.

భూషయ్యను అల్లంతదూరంలో చూడగానే వీరమ్మకు గుండెలు జారిపోయాయి! కాళ్ళు వణికాయి. జారిపోతున్న గుండెల్ను చిక్కపట్టుకుంటూ మెల్లగా వచ్చింది. వీరమ్మను చూడగానే భూషయ్య గొంతు తారాస్థాయికి లేచింది.

"వచ్చావా దొరసానీ! రా - నెల అద్దె అసలు కట్టుతావా. కట్టవా? ఇవ్వాళేదో తేల్చి చెప్పు. వారంరోజుల్నుంచి రేపూ మాపూ అని తిప్పిస్తున్నావు-" అని అన్నాడు.

తల్లిని చూడగానే అక్క చంకలోవున్న కుర్రాడు కిట్టిగాడు చంకలోంచి కిందకు జారిపోయి, బూల బూల అని ఏడుస్తూ వీరమ్మ కాళ్ళకు చుట్టేసుకున్నాడు.

విదిలించి వాడ్ని వదిలించుకుంటూ, "అయ్య బూసయ్య బాబుగారు! నాల్గురోజులు వుండు బాబూ, నీ కాళ్ళకు మొక్కుతా దొరా! నీకిస్తానికి వుంచిన పయికం కాస్తా ఇగో ఈ మాయదారి గుంటడి రోగానికి కర్చయిపోయినాది. పయిగా ఈ ఇద్దమంటేదో నాసావుకొచ్చింది. నానోట్లో దుమ్ముకొట్టింది. కిరిసినుయిన దొరక్కుండా పోయింది. అయ్యాయ్యా, నాల్గురోజులోపిక పట్టావంటె ఎట్టాగొట్టా పయికం కట్టుతా పిల్లల ముండను దయసూపు బాబూ!" అని ప్రాధేయపడింది.

మధ్యలో "బూలబూల" అని ఏడుస్తూ చీరగుంజుతూ కాళ్ళు రక్కుతూ మారాం చేస్తున్న

పిల్లగుంటడ్ని, "ఓరుండరా సచ్చినోడా! నాపేణానికి తకలాటక మయ్యావు. మాయదారి గుంటడా!" అని ఒక్క గుంజుగుంజి వట్టివంటిమీద నాల్గు సరుపులు సరిచింది. వాడు గుక్కపెట్టి ఏడుస్తూ క్రింద మట్టిలోపడి దొర్లటం మొదలుపెట్టాడు.

భూషయ్య కాస్తమెత్తపడ్డాడు.

"ఇదిగో వీరమ్మా వారంరోజులు టయిం ఇస్తున్నా ఈ లోపల డబ్బు కట్టావా సరేసరి- లేకపోతే నీ గుడిశ పీకి అవతల పారేసేది ఖాయం! అనక నీవు ఏడ్వా, ఎర్రమన్నులో కలువూ- ఆఁ- ఇప్పుడే చెబుతున్నా-" అని హెచ్చరిక చేసి పోయాడు.

ఆ కాలవగట్టు ఆ పట్టణానికి నడిబొడ్డున వుంది. అందుకే భూషయ్యకంత డిమాండు. వీరమ్మనక్కడ్నుంచి లేపితేచాలు మాకంటె మాకని లేబరు జనం వచ్చి పడతారు.

వీరమ్మకు కళ్ళు బయర్లుకమ్మాయి. వంటిమీద కిర్సనాయలు బోసి నిప్పుపెట్టినట్లనిపించింది.

ఏడ్పుముంచుకొచ్చింది. ఏడ్పుతో పాటు అర్థంలేని కోపం, కసి - తన అసహాయస్థితికి, దౌర్భాగ్యానికి తనమీద తనకే అసహ్యం - జుట్టు పీక్కోవాలనిపిస్తోంది; వళ్ళు రక్కుకోవాలనిపిస్తోంది.

ఈ స్థితిలో కూతురు సీత ఎదురుగా కనిపించింది. తనలోని ఈ వికారమంతా ఆ పిల్లబొంద మీద కోపంగా మారిపోయింది.

"లంజాముండా, నిన్నా పోలేరమ్మ వేసుకుపోనూ! ఆ సచ్చినాడట్టా కిందపడి పొర్లిపొర్లేడుత్తుంటే తీయకుండా నిలబడి ఇసిత్రం చూత్తున్నా ఇసిత్రం. ఎందే, గుంటా! యింకా అట్టా నిలబడ్డావు -" అని ఆ పిల్ల ముండ జుట్టు పట్టుకుని ఆ పక్కన పడివున్న తాటిమట్టను తీసికొని గొడ్డును బాదినట్టు బాదింది.

"అమ్మో నాను సచ్చిపోతున్నావే- అమ్మా నీకు దణ్ణం పెట్తా. కొట్టమాకవే- అమ్మో, సచ్చానే! అమ్మా, అమ్మోయ్..... సంపకే, సంపకే....." అని ఆ పిల్ల తల్లి కొట్టే దెబ్బలను ఆపుకుంటానికి చేతులడ్డం పెడుతూ శోకాలు పెట్టుతుంటే వీరమ్మ శివమొక్కినదానిలాగా కూతుర్ను, కిందపడి దొర్లుతున్న కొడుకును వరస మార్చి వరస కొట్టింది. తన చేతులు నొప్పులు పుట్టేవరకు, వాళ్ళను కొట్టి గుడిసె ముందు కూలబడింది.

"మాయదారి సంత! మిమ్మల్నాగంగానమ్మేసుకుపోను. సచ్చిన మీ అయ్యతోపాటు మీరూ సచ్చినా, ఒకేడ్పు ఏడిసి వూరుకునేదాన్ని- నా పేణానికేడో దాపురించారు. మిమ్మలా పోలేరమ్మకు బలెయ్యా!" అని కటికతిట్లు తిట్టుతుంటే వీరమ్మకా కోపంలోంచి ఆపుకోలేని దుఃఖం ముంచుకొచ్చింది.

మాటిమాటికి పమిటచెంగుతో కళ్ళు తుడ్చుకుంటూ ముక్కు చీదేస్తూ ఆ చీకట్లో హృదయ విదారకంగా కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ అలా కూర్చుండిపోయింది.

సీత తల్లికి పెడగా నీళ్ళకుండలు ప్రక్కన నేలమీద తేమలో కూర్చుని చిన్నగా ఎక్కిళ్ళు పెడుతుంది. మధ్యమధ్యలో కళ్ళు తుడ్చుకుంటూ తల్లివంక చూస్తోంది. కిట్టిగాడు ఏడ్చి ఏడ్చి కాసేపటికి ఏడ్పుమాని మెల్లగా అక్కదగ్గరకు జేరాడు. అక్క వళ్ళో తలపెట్టి పడుకున్నాడు. వుండి వుండి బెక్కుతున్నాడు. అలా బెక్కినప్పుడల్లా వాని చిన్నిబోర ఎగిరెగిరి పడుతుంది.

వుత్తపున్నేనికి తల్లి ఎందుకన్ని చావుదెబ్బలు కొట్టిందో, మళ్ళీ తనెందుకేడుస్తుందో ఆపిల్లకు తెలియదు. ఈ తల్లిబాధ, దుఃఖం నిస్సహాయ స్థితి నంగనాచిలాగా నిండుగా నిశ్చలంగా ప్రక్కనే పారుతున్న ఆ కాలవకూ తెలియదు. ఆ కాలవప్రక్కన తళ తళ మెరిసిపోయే దీపాలతో ధగధగ లాడిపోతున్న ఆ పట్టణానికీ తెలియదు.

* * *

ఒక రాత్రి సమయంలో వీరమ్మకు మెలకువ వచ్చింది. నిద్దట్లో ప్రక్కకి వత్తిగిలుతున్నప్పుడు నడుం క్రింద గట్టిగా తగిలింది. ఇదేమిటా అని లేచి చూచింది. పమిటచెంగున కట్టుకున్న 'జీడీలు' పొట్లమది. చిన్న కాగితం ముక్కలో చుట్టి పమిటచెంగుకు కట్టుకుంది. తను పన్జేసే శారదమ్మగారి చిన్నకొడుకు దగ్గర నోట్లో పెట్టుకుని వూదేబూరను చూసి అలాటిది కావాలని మూడురోజుల్నుంచి కుర్రాడు 'బూల బూల' అని ఏడుస్తున్నాడు. ఇవాళ తను మధ్యాహ్నం పనిలో కెళ్ళేటప్పుడు కూడా ఏడ్చాడు. సాయంత్రం వస్తూ తీసికొస్తానని సముదాయించి వెళ్ళింది. అందుకే సాయంత్రం గుడిశకు రాగానే కాళ్ళుకు చుట్టేసుకుని "బూల, బూల" అని ఏడవటం మొదలుపెట్టాడు. బూర కొనాలంటే పదిపైసలు కావాలి. ఆ పదిపైసలు ఖర్చుపెట్టే తాహతులేక జీడీలు యిచ్చి మరిపిద్దామని సాయంత్రం గుడిశకొచ్చే ముందు చిన్న మార్కటు దగ్గర రెండు పైసలు పెట్టి రెండు జీడీలు కొన్నది.

"అయ్యో, నామతి మార్నమైపోను. పిల్లగాడి కోసరం తెచ్చిన జీడీలు ఆడికెట్టకుండా సీరసెంగుకు కట్టుకుని మరిసిపోయాను-" అని అనుకుంది.

పిల్లడికోసం చీకట్లోచేతుల్తో తడుములాడుకుంది. ఆ చెమ్మనేల మీద చింకిగోనెమీద అక్కను కర్చుకుని పడుకున్నాడు. వాడ్ని దగ్గరకు తీసికొని తన గుండెల్లోకి పొదుముకుంది. వాడి పొట్ట వుసూరుమంటున్నది. తనాపూట కూడు వండలేదు. ఏడ్చిఏడ్చి ఉత్తకడుపుతో సొమ్మసిల్లి పడుకొని పోయాడు. వీరమ్మకు కడుపు చెరువై పోయింది.

"అయ్యో, నాకొడకా- నా చేతులిరిగిపోనూ- నిన్నెన్ని దెబ్బలు కొట్టిసచ్చానురా- నేను రాచ్చసి ముండనురా? సీ! నా జల్మం పాడుకాను! నా చేయి చెట్టయిపోనూ!"

వీరమ్మకు గుండెల్ని కుళ్ళగించుకుని ఏడ్పుముంచుకొచ్చింది. పిల్లలిద్దర్నీ గుండెలదుముకుని "మీ అయ్యేకందా బతికుంటే నాకీ కట్టాలుండేయా?" అని కుమిలి కుమిలి ఏడ్చింది.

..... కాసేపటికి మెల్లమెల్లగా వీరమ్మ ఏడ్పును గుండెల్లోకి దిగలాక్కుంది. "అరేఁయి కిట్టిగా - లేరా అయ్యా. ఇదిగో ఇట్సూడూ జీడి ముక్కరా-వోపాలి కళ్ళు తెరు - సూడు సూడు - ఈడరా, ఆఁ నోట్లో ఎట్టుకో - ఓసి సీత నిద్దర మొకమా లేయే - కళ్ళు తెరిసిసూడే - జీడీలే.... ఆఁ అగ్గో - సూశావా ....... బుగ్గ నెట్టుకొని తొంగో -" అని వాళ్ళను లేపి అప్పటికప్పుడు కొంగుకు కట్టిన జీడీల్ని పిల్లసన్నాసులకు పెట్టేవరకు వీరమ్మకు మళ్ళీ నిద్రపట్టలేదు.

అదే సమయంలో పెద్ద పడవలాటి అద్దాల పందిరి మంచంమీద బూరగదూది పరుపుమీద పడుకున్న షావుకారు చెంగయ్యకు నిద్దట్లో ప్రక్కకు వత్తిగిల్లుతున్నప్పుడు పక్కలో పర్వతంలా పడుకున్న

భార్య పెద్దపెద్ద రొమ్ములు భుజానికి పొడుచుకుని మెలకువ వచ్చింది. 'సిమిట్రి' లేని బలుపుతో బల్లపరుపులాగా వున్న భార్యను దగ్గరకు లాక్కున్నాడు. చీకట్లో మెడమీద చేతులేసి తడుముకుంటుండగా లక్ష్మీకాంతమ్మకు మెలకువ వచ్చింది.

"ఏందీ మడిసియ్యాళ మీద మీద కొత్తున్నాడూ? మెడచుట్టూ చేతులేస్తున్నావేంటి? పీక పిసికి చంపి, నా ఆస్తి అంతా వేసుకుందామని సూత్తున్నా ఎట్టా?"అని దీర్ఘం తీసింది.

"ఓసి నీ బండపడ! నీ పీకెందుకు పిసుకుతానే? మెడ పట్టెడకెంత బంగారం పట్టుతుందా అని నీ మెడ తిరుగుడు సూత్తున్నానే! నా సాఁవిరంగా, ఆ దేముడు చల్లగాచూసి ఈ యుద్ధం ఆగకుండా ఇట్టాగే సాగితే కిర్సనాయిలు బేరం మీద నీ మెడ కింకో పట్టెడ సేపిత్తానే బుజ్జీ."

"ఇంకో పట్టెడెందుకు? ఇప్పటికే పెట్టెడు నగలుంటే - ఆ డాబా అట్టా బోసిగా ఏడుస్తుంది. దాని మీదో అంతస్థు లేపరాదంటా?"

"ఎట్టా నీ బండపడ. బలే గుర్తు చేశావే. నేనా సంగతే మర్చిపోయా. లేపాల్సిందే!" అన్నాడు వుషారుగా.

* * *

వీరమ్మకు కాస్త కాస్త గుండెలు సేద తీరుతుండగా మెల్లగా కన్నుమూసి చిన్నగా కునుకులోకి జారింది. ఆ కునుకులోనే వీరమ్మకొక విచిత్రమైన కలవచ్చింది. గుడిశ ప్రక్కనవున్న కాలవనిండా నీళ్ళకు బదులు కిర్సనాయిలు పారుతుందట. వీరమ్మ బుడ్లకు బుడ్లు కిర్సనాయిలు కాలవలో ముంచి రిక్షావాళ్ళకమ్ముతుందట.

అదేసమయంలో చెంగయ్య కూడా కలకంటున్నాడు. గమ్మత్తేమిటంటే, వీరమ్మకు నీళ్ళల్లో కిర్సనాయిలు కనిపిస్తుంటే, చెంగయ్యకేమో కిర్సనాయిల్లో నీళ్ళు కనిపిస్తున్నాయి. ఇంకో గమ్మత్తేమిటంటే వీరమ్మ పిచ్చిముండ కాబట్టి కలలో కూడా ఆ చిన్న చిన్న బుడ్లతోనే అమ్ముతుంది; చెంగయ్య కలలో పెద్ద పెద్ద టిన్నుల్తో అమ్ముతున్నాడు.

* * *

అదేం విచిత్రమోగాని వున్నవారు కన్నకలలే నిజమవుతాయి; కలలు పండిన పండు జీవితాలు వీళ్ళవి. లేనివారు కనేకలలు కల్లలవుతాయి; వీళ్ళ జీవితమే ఒక పెద్ద పగటికల.

షావుకారు చెంగయ్యా, పనిమనిషి వీరమ్మా కలలు కూడా వున్నవారి కలలుగా, లేనివారి కలలుగా అయ్యాయి.

అవటానికి యిద్దరూ వ్యాపారస్థులే - కాకపోతే బడా, చోటా - దేశంలోని అత్యవసర పరిస్థితిని యుద్ధకాలాన్నీ చెంగయ్య గొప్పగా వాడుకున్నాడు. పాకిస్తాన్‌తో పద్నాలుగు రోజులపాటు జరిగిన యుద్ధకాలంలో చెంగయ్య రెండుచేతులా సంపాదించాడు. భార్య యిచ్చిన సలహా ననుసరించి వున్న మేడమీద మరో అంతస్థులేపాడు. వీరమ్మ యిళ్ళల్లో పాచిపనులు చేసుకునే పనిమనిషి. రోడ్డుప్రక్క కూర్చుని రిక్షా దీపంబుడ్లకు కిర్సనాయిలమ్ముకుని జీవించే బుల్లి వ్యాపారస్థురాలు. సమాజంలో అతి

సామాన్యమైన వ్యక్తి. యుద్ధం యొక్క 'ఎఫెక్టు', రోడ్డుప్రక్క కూర్చుని లీటరు కిరసనాయిల్ను మారుబేరాని కమ్ముకుని పావలా డబ్బులు సంపాదించి, ఆ పావలాతో నూకలు కొనుక్కొని, గంజి కాచుకుని మాడే డొక్కల్ని తడుపుకుని బ్రతుకుతున్న వీరమ్మ మీద అతి దారుణంగా, క్రూరంగా దెబ్బకొట్టింది. నెత్తిమీద గూడు పోయింది. గడువులోపల భూషయ్య బాకీ తీర్చలేకపోయింది. ఈ ఛేరెడు నేలను దక్కించుకోలేక పోయింది. తను పన్జేసే ఇళ్ళ అమ్మగార్లను ఒక్క పదిరూపాయలు అప్పు పెట్టండని అతి దీనంగా ప్రాధేయపడి అడిగింది. వాళ్ళవీ మధ్యతరగతి సంసారాలే; వాళ్ళవీ అంతంత మాత్రపు బ్రతుకులే!

"మాదగ్గర ఇప్పుడు పదిరూపాయలుంటాయా వీరమ్మ? మేమూ యిబ్బంది పడుతున్నాం." అన్నారు.

"ఆ కిరిసినుయిన దొరికితే నాకీ కట్టం రాదమ్మ. ఈ ముదనట్టపు ఇద్దమేడదో నాసావుకొచ్చింది; నా బేరం మూతపడింది-" అని అంది దిగులుగా, విచారంగా.

రెండురోజుల కొకసారి క్యూలో మనిషికొక లీటరు పోస్తున్నారు. పోసేది వుదయం పోస్తారో, సాయంత్రంపోస్తారో తెలియదు. వాళ్ళ ఇష్టం. గంటలకొద్దీ క్యూలో నిలబడితే తనదాకా వస్తుందనే నమ్మకంలేదు. పయిగా పనికి నాగా పెట్టాలి. నాగాలిప్పటికే ఎక్కువయ్యాయి. ఈ కిర్సనాయిలు మూలంగా ఇంకా నాగాలు పెట్టితే ఇళ్ళేపోతాయి. నాగా పెట్టిన రోజున అన్నంముద్ద దొరకదు. పిల్లల కడుపు లెండకట్టాలి. బేరం లేకపోయేసరికి ఇప్పటికే పస్తులుంటున్నారు.

అలా వీరమ్మ నమ్ముకున్న చేరెడు చెక్కా చేయిజారిపోయింది. మహాతల్లి ఆ భూదేవికి ఎక్కడికక్కడ సంకెళ్ళు; జాలి ఉన్నా జాగా యివ్వలేని బానిసపు బ్రతుకామెది! సమాజంపరంగా ఈ కథకు ఇది ముగింపు. వీరమ్మలాంటి వాళ్ళ కథలకు దేశం చెప్పే ముగింపు!

- ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
పరీధావి ఉగాది *(1972)*

★